సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 8 । జూలై । 2025



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు సీవీ వాసుదేవ రాయ్, ఉషరాయ్ దంపతులు (హైదరాబాదు) రూ.1,01,116 విరాళం అందజేశారు.



అరుణాచల క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ

ప్రత్తిపాడు మండలం రాచపల్లిలోని ఆంధ్రా అరుణాచల క్షేత్రంలో సోమవారం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. 63 మంది నాయనార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు.

8లో

కడలిలోకి 1,85,143 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటి ఉధృతి సోమవారం స్వల్పంగా తగ్గింది. బ్యారేజీ నుంచి 1,85,143 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 12,650 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.70 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టర్లు

అమలాపురం రూరల్: తమకు బిల్లులు చెల్లించనందుకు నిరసనగా జిల్లా కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. మూడు సంవత్సరాలుగా 15 ఆర్థిక సంఘానికి సంబంధించిన బిల్లులు ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పల్లె పండగ పేరుతో ఎన్ఆర్‌జీ ఎస్ నిధులతో రూ.170 కోట్లు పనులు చేయించారని తెలిపారు. కనీసం జీఎస్టీ కూడా ఇవ్వలేదన్నారు. డిప్యూటీ సీఎం చెప్పారని చిన్నచిన్న కాంట్రాక్టర్లు అందరూ కలిసి పనులు చేశామని, వారం వారం పేమెంట్ ఇస్తామని చెప్పారని, ఇప్పటి వరకు ఏడు నెలలు జరిగినా బిల్లులు ఇవ్వలేదని చెప్పారు.

అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. కలెక్టర్‌కు సంఘ నాయకులు అల్లాడ వెంకటరమణ, రాయపురెడ్డి శ్రీనివాసరావు, అడ్డగళ్ల సాయిరామ్, గంధం బ్రహ్మానందం వినతిపత్రం అందించారు.

10న మెగా పీటీఎం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ యాజమాన్యాలలోని పాఠశాలు, జూనియర్ కళాశాలల్లో ఈ నెల 10వ తేదీన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం)ను సమర్థంగా నిర్వహించాలని నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఎంఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మెగా తల్లి దండ్రులు ఉపాధ్యాయుల సమావేశ నిర్వహణ విధివిధానాలను వివరించి సన్నద్ధత చర్యలపై ఆరా తీశారు.

కలెక్టర్ మాట్లాడుతూ ఈ మీటింగ్ గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహించగా ఈ ఏడాది ప్రైవేటు విద్యా సంస్థ ల్లోనూ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తల్లి పేరిట ఒక మొక్కను పాఠశాల ఆవరణ లేదా వారి ఇంటి వద్ద నాటడం ఈ ఏడాది థీమ్‌గా తీసుకున్నట్టు తెలిపారు. జాయింట్ కలెక్టర్ టీ. నిషాంతి, డీఈవో సలీంబాషా డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావు దొర పాల్గొన్నారు. ప్రభుత్వ దాతలు, ప్రజలు భాగస్వామ్యంతో సమాజంలోని పేదరిక నిర్మూలన లక్ష్యంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పనిచేయాలని కలెక్టర్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు సచివాలయ సంక్షేమ, డిజిటల్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. పీ4 కార్యక్రమం విధి విధానాలపై సమీక్షించారు.

ప్రగతి వారధి... సంక్షేమ సారధి





గోదావరి డెల్టా ఆధునీకరణ పనులు


- 'కోనసీమ'పై చెరగని... వైఎస్సార్ సంతకం
- కాటన్ తరువాత డెల్టా ఆధునీకరణకు పెద్ద పీట
- డెల్టా కాలువ వ్యవస్థకు రూ.1,160 కోట్లు
- రూ.550 కోట్లతో మురుగునీటి కాలువ వ్యవస్థ ఆధునీకరణ
- ఏటిగట్ల పటిష్ట పనులకు రూ.650 కోట్లు
- రూ.48 కోట్లతో అన్నంపల్లి అక్విడెక్టు పనులు
- కోనసీమ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

సాక్షి, అమలాపురం: ఒక మనిషి నిండు నూరేళ్ల జనం మధ్య ఉండాలంటే వందేళ్లు జీవించనక్కర్లేదు. సమాజానికి చేసిన సేవల వల్ల అతను మరణించిన తరువాత కూడా జనం మనసులో నిలిచిపోవడం ద్వారా నిండు నూరేళ్ల జీవనం పూర్తి చేసుకుంటారు. ఇటువంటి వారిలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఒకరు. మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో అధిక కాలం పోరాటాలతోనే సరిపోగా.. ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల నాలుగు నెలల కాలంలో సంక్షేమ సారధిగా... అభివృద్ధి ప్రదాతగా రాష్ట్రంలోనే కాదు.. దేశంలో తనకుంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. పేద, బడుగు, **బలహీన వర్గాల, రైతు, మహిళా పక్షపాతి ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారు. ఉమ్మడి జిల్లా.. మరీ ముఖ్యంగా కోనసీమ అభివృద్ధిపై చెరగని సంతకం** చేశారు. అందుకే ఆయన మృతి చెంది 16 ఏళ్లు కావస్తున్నా జనం గుండెల్లో ఆయన వేసిన ముద్ర నేటికీ చెరగడం లేదు. నేడు దివంగత నేత వైఎస్సార్ జయంతి సందర్భంగా 'సాక్షి' కథనం...

డెల్టా కాలువలకు కొత్త రూపం

- గోదావరి డెల్టా రూపశిల్పి సర్దార్ కాటన్ తరువాత డెల్టా వ్యవస్థ పునర్నిర్మాణానికి దివంగత మహానేత పెద్ద పీట వేశారు. అధ్వాన స్థితికి చేరిన డెల్టా వ్యవస్థ మొత్తం రూపరేఖలను మార్చేందుకు సిద్ధమయ్యారు. కాటన్ చేతిలో రూపొందిన గోదావరి డెల్టా వ్యవస్థలో చిన్నచిన్న మరమ్మతు పనులు, క్లోజర్ పనులు మినహా పెద్దగా ఆధునీకరణ పనులు చేపట్టలేదు. వైఎస్సార్ హయాంలో రూ.1,160 కోట్లతో పంట కాలువల, రూ.550 కోట్లతో మురుగునీటి కాలువల ఆధునీకరణ పనులు చేపట్టారు.
- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలలో తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల పరిధిలోని సుమారు 10.60 లక్షల ఎకరాల వరి ఆయకట్టుకు సంవృద్ధిగా సాగునీరు వెళ్లేందుకు, పంట చేల నుంచి ముంపు నీరు దిగేందుకు ఆయన చర్యలు చేపట్టారు. వైఎస్సార్ బతికి ఉండగా వేగంగా జరిగిన పనులు ఆయన మృతితో ఆటకెక్కాయి.
- పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ద్వారా కొత్తగా 7.50 లక్షల ఎకరాల ఆయకట్టు తీసుకురావడమే కాకుండా... డెల్టాలో 10.60 లక్షల ఎకరాల గోదావరి ఆయకట్టు స్థిరీకరణకు చర్యలు తీసుకున్నారు.
- ఐలెండ్‌కు సాగునీరందించే అన్నంపల్లి అక్విడెక్టు అధ్వానంగా మారడంతో రూ.48 కోట్లతో కొత్త అక్విడెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు.

'అచ్చ తెలుగు అన్నదాత'



వైఎస్సార్ అచ్చ తెలుగు రైతు ఆహార్యం

దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పేరు స్ఫురణకు వచ్చినప్పుడు నెత్తిన తలపాగా.. మోముపై చిరు నవ్వు.. తెల్లని దుస్తులు.. తెలుగు వారి సంప్రదాయ పంచెకట్టు గుర్తు రాకమానవు. అచ్చ తెలుగు పల్లె రైతు ఆహార్యంతో వైఎస్సార్ రైతుకు ఒక బ్రాండ్ అంబాసిడర్. రైతు కట్టూ బొట్టూ మాత్రమే కాదు.. అధికారంలో ఉన్నన్నాళ్లూ రైతు అనుకూల విధానాలు, రైతుకు మేలు చేసే పనులతో రైతు పక్షపాతిగా వారి మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. నాడు ఉమ్మడి జిల్లా రైతుల కోసం ఆయన చేపట్టిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలను ఈ ప్రాంత రైతులు ఎన్నటికీ మరువరు. ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సైతం తండ్రి బాటలోనే రైతు సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేసి తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు.

ఇక్కడే పలు కార్యక్రమాలకు శ్రీకారం



వైఎస్సార్ హయాంలో జిల్లాలో నిర్మించిన రివిట్‌మెంట్, గ్రోయిన్లు

- వైఎస్సార్‌కు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాపై ఒక ప్రత్యేకాభిమానం ఉండేది. ఆ కారణంగానే ఆయన ఇక్కడ పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కోనసీమకు వైఎస్సార్ చేసిన మేలు అంతాఇంతా కాదు. భారీ వరదలు వచ్చిన ప్రతిసారి ఏటిగట్లకు గండ్లుపడి కోనసీమకు జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం చెప్పలేనంత ఉండేది. 2006లో గోదావరికి రికార్డు స్థాయిలో వచ్చిన వరదల వల్ల జిల్లాలో అయినవిల్లి మండలం శానపల్లిలంక, పి.గన్నవరం మండలం మొండెపులంక వద్ద ఏటిగట్లకు గండ్లు పడ్డాయి. దీనివల్ల పెద్ద ఎత్తున నష్టం జరిగింది. దీనిని గుర్తించిన వైఎస్సార్ జిల్లాలో బలహీనంగా ఉన్న ఏటిగట్ల పటిష్ట పనులకు రూ.550 కోట్లు కేటాయించగా, పనులు పూర్తయ్యే సమయానికి రూ.650 కోట్లకు చేరింది. ఆయన హయాంలోనే 70 శాతం పనులు పూర్తయ్యాయి.
- గోదావరి నదీ కోత నివారణకు రూ.90 కోట్లు కేటాయించి గ్రోయిన్లు, రివిట్‌మెంట్‌ల నిర్మాణాలు చేపట్టారు. అయినవిల్లి మండలం కొండుకుదురులంక, పొట్టిలంక కోతలు ఆగి ఇంకా ఆ గ్రామాలు ఉన్నాయంటే అందుకు వైఎస్సార్ కారణం.
- రాజీవ్ గృహకల్పలో భాగంగా అమలాపురం మండలం నల్లమిల్లిలో శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో మొదటసారి ఈ కార్యక్రమానికి అమలాపురంలో శ్రీకారం చుట్టారు. ఇదే జిల్లా అల్లవరంలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాజీవ్‌నగర్ బాటకు సైతం అమలాపురం మున్సిపాలిటీలో శ్రీకారం చుట్టారు.

రైతు పక్షపాతం



ఉచిత విద్యుత్ బోర్లు

రైతులకు మేలు జరుగుతోంది అంటే ఎటువంటి కార్యక్రమం అమలు చేయాలన్నా వైఎస్సార్ వెనకడుగు వేయలేదు. అందుకే రైతు అనుకూలమైన నిర్ణయాలను అత్యంత వేగంగా తీసుకునేవారు. దానిలో ముఖ్యమైంది ఉచిత విద్యుత్. దీనివల్ల జిల్లాలో ఉద్యాన రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. ముఖ్యంగా కొబ్బరి, అరటి, పసుపు, కూరగాయల పంటలు సాగు చేసే రైతులకు ఉచిత విద్యుత్ చేసిన మేలు అంతాఇంతా కాదు. జిల్లాలో మొత్తం 20,452 వ్యవసాయ విద్యుత్ మోటార్లు ఉండగా, వీటిలో 11,901 పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందుతోందంటే అందుకు దివంగత నేత వైఎస్సార్ కారణం.

- 2008లో గోదావరి డెల్టాలో రబీకి నీటి ఎద్దడి ఏర్పడింది. అప్పట్లో సీఎం హోదాలో రాజమహేంద్రవరం వచ్చిన వైఎస్సార్ పరిస్థిని అర్థం చేసుకున్నారు. రూ.7.50 కోట్లతో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నారు. డ్రెయిన్లపై క్రాస్‌బండ్‌ల ఏర్పాటు, మోటార్లతో కాలువల్లో నీరు చేలకు మళ్లింపుతోపాటు గోదావరిలో వృథా నీటిని పంట కాలువలకు మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. తరువాత కాలంలో ఎప్పుడు నీటి ఎద్దడి వచ్చినా, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇదే విధానంతో రబీని గట్టెక్కిస్తుండడం విశేషం.
- 2007 ఏడాది కొబ్బరి సంక్షోభంలో ఉంది. నాడు కోనసీమకు చెందిన రైతులు స్వయంగా వైఎస్సార్‌ను కలిసి చేసిన విజ్ఞప్తికి స్పందించిన ఆయన కొత్త కొబ్బరి (తయారీ కొబ్బరి)పై ఉన్న రెండు శాతం వ్యాట్ పన్నుకు మినహాయింపు ఇచ్చారు. మరో సందర్భంలో కేజీ రూ.9.20 చేసి కొబ్బరి కాయను మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు చేయించారు.

దళితులపై పెరిగిన అరాచకాలు

ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న డీబీ లోక్

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం వచ్చాక దళితులపై హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డీబీ లోక్ ఆందోళన వ్యక్తం చేశారు. దళితులంతా ఏకమై కూటమి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకలించాలని పిలుపునిచ్చారు. స్థానిక అరిగెలపాలెంలో సోమవారం జరిగిన ఆర్‌పీఐ ముఖ్య నాయకుల సమావేశంలో లోక్ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులో కుల రాక్షసి విలయ తాండవం చేస్తోందన్నారు. సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఓ దళిత బాలికపై 17 మంది అత్యాచారం చేస్తే ఇప్పటిదాకా దోషులను అరెస్ట్ చేయలేదని చెప్పారు. దోషులకు కూటమి ప్రభుత్వ పెద్దలు అండగా నిలిచారని, ఈ ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టి నిర్వీర్యమైందని చెప్పారు. ఇరాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో దళితులపై దాడులు, అరాచకాలు జరుగుతున్నా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు శూన్యమని అన్నారు. చంద్రబాబు సంపద సృష్టి, పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం, లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అంటూ ఆర్భాట ప్రచారం చేసుకుంటున్నారే తప్ప ప్రజా సంక్షేమం, హామీల అమలు, లా అండ్ ఆర్డర్ అనే మూడు ముఖ్యమైన విషయాలను విస్మరిస్తున్నారని అన్నారు. పార్టీ నాయకులు ఈవీవీ సత్యనారాయణ, గోసంగి ఆనందరావు, చిలకపాటి సాంబశివరావు, నాగాబత్తుల ప్రసాదరావు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: అర్జీదారుల సమస్యల పట్ల సత్వరమే స్పందించి పరిష్కార మార్గాలు నూటికి నూరు శాతం సంతృప్తి కరంగా అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ. నిషాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 290 అర్జీలను స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ అర్జీదారుడి సంతృప్తి లక్ష్యంగా సమస్యను పరిష్కరించాలన్నారు. తమ ఫిర్యాదు స్థితిని ఆన్‌లైన్, 1100 కాల్ సెంటర్ ద్వారా తెలుసు కోవచ్చునన్నారు. డీఆర్‌ఓ రాజకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీసీహెచ్ ఎస్ కార్తీక్, డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావు దొర, డీఎఫ్ఓ ఎంవీప్రసాద రావు, ఎస్‌డీసీ ఈ. కృష్ణమూర్తి, డీఎల్‌డీవో రాజేశ్వరరావు డీఎస్ఓ ఎ.ఉదయభాస్కర్, డీపీవో శాంత లక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, వికాస జిల్లా మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

పోలీస్ గ్రీవెన్స్‌కు 24 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 24 అర్జీలు వచ్చాయి. ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌కు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలపై వినతులను అందజేశారు. ఎస్పీ ప్రతి అర్జీదారునితో ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను విచారించారు.

కలెక్టరేట్ వద్ద ఉద్యాన సహాయకురాలి ధర్నా



ధర్నా చేస్తున్న ఉద్యాన సహాయకురాలు, కుటుంబ సభ్యులు

అమలాపురం రూరల్: సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా ఉద్యాన సహాయకుల కౌన్సెలింగ్‌లో అధికారులు అవకతవకలకు పాల్పడినట్లు అంబాజీపేట మండలం ముక్కామల సచివాలయం ఉద్యాన సహాయకురాలు రంప లక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లాలో 52లో ర్యాంకుతో గతల నెల 29 తేదీన జరిగిన కౌన్సెలింగ్‌లో కొత్తపేట మండలం అవిడి- 2, వానపల్లి, మెడెకుర్రులో ఏదో ఒక చోటుకు బదిలీ చేయాలని దరఖాస్తు చేసుకుంటే అవిడి-2కు బదిలీ ఇచ్చారని తెలిపారు. ఇంటికి వెళ్లిసరికి రాజకీయ వత్తిడితో ఆ బదిలీని రద్దు చేశారని వాపోయారు. దీనిపై ఉద్యాన శాఖ ఏడీ పీవీ రమణను కలవగా 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న సఖినేటిపల్లి మండలం రామరాజు లంకకు బదిలీ చేసినట్టు చెప్పారన్నారు. చిన్నపిల్లలతో ఉన్న తనకు అవిడి-2కు బదిలీ ఇవ్వాలని ఆమె జాయింట్ కలెక్టర్ నిషాంతికి ఫిర్యాదు చేశారు.

లండన్ సీఎంఏ సమావేశానికి ఆహ్వానం



డాక్టర్ పీఎస్ శర్మ

అమలాపురం టౌన్: ప్రపంచంలో 56 దేశాల సభ్యత్వం కలిగిన కామన్ వెల్త్ మెడికల్ అసోసియేషన్ (సీఎంఏ) ఆధ్వర్యంలో ఈ నెల 18న లండన్‌లో జరగనున్న సర్వ సభ్య సమావేశానికి భారత దేశం నుంచి అమలాపురానికి చెందిన సీఎంఏ సభ్యుడు డాక్టర్ పీఎస్ శర్మ హాజరవుతున్నారు. ఈ మేరకు సీఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జేఏ జయలాల్ నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. స్థానిక ప్రెస్‌క్లబ్ భవనంలో డాక్టర్ శర్మ సోమవారం విలేకర్ల సమావేశంలో ఈ విషయం వివరించారు. సీఎంఏకు అనుబంధంగా పనిచేస్తున్న స్టాఫ్ టీబీ ఇనిషియేటివ్ సబ్ కమిటీ సభ్యుడిగా తాను నియమితులైన సంగతిని కూడా డాక్టర్ శర్మ తెలిపారు.

బస్‌పాస్‌లకు వేళాయె



- ఉచిత, రాయితీ బస్సుపాసుల మంజూరుకు ప్రభుత్వం చర్యలు
- 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు అవకాశం

గతేడాది జారీ చేసిన బస్‌పాస్‌లు ఇలా

కేటగిరీ ఆఫ్ పాస్	జారీ చేసిన పాస్‌లు
12 ఏళ్ల లోపు విద్యార్థులకు ఉచిత పాస్‌లు	2,274
18 ఏళ్ల లోపు విద్యార్థినిలకు ఉచిత పాస్‌లు	8,342
విద్యార్థులకు నెలవారీ పాస్‌లు	34,210
మూడు నెలల పాస్‌లు	14,830
ఇయర్లీ పాస్‌లు	57
దివ్యాంగులకు జారీ చేసిన పాస్‌లు	1,820
మంత్లీ సీజన్ పాస్‌లు	5,866

రాయవరం: విద్యా సంవత్సరం పునః ప్రారంభమైంది. పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతమైంది. దూర ప్రాంతాలకు వెళ్లి విద్యాభ్యాసం చేసే విద్యార్థులు ఉదయాన్నే కళాశాలలకు వెళ్లేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులకు ప్రజా రవాణా శాఖ ఏటా ఉచిత, రాయితీ బస్సుపాసులను మంజూరు చేస్తుంది. 2025-26 విద్యా సంవత్సరానికి ఆర్టీసీ బస్‌పాస్‌ల జారీ ప్రారంభమైంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 7,657 పాస్‌లు జారీ చేశారు.

చదువులకు ఊతం

జిల్లాలోని అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం ఆర్టీసీ డిపోల నుంచి విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత, రాయితీ బస్సు పాస్‌లను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్టీసీపీఏఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రెండు నెలల సెలవుల తర్వాత విద్యా సంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రజా రవాణా శాఖ బస్సు పాసు కౌంటర్లు ప్రారంభించింది. బస్సు రూటు ఆధారంగా రాయితీ చార్జీని నిర్ణయిస్తారు.

ఎవరెవరికి ఇస్తారంటే

12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఉచితంగా బస్‌పాసులను జారీ చేస్తారు. ఇవి ఏడాది వరకు చెల్లుబాటు అవుతాయి. ఈ పాస్‌ల ద్వారా విద్యార్థులు తమ నివాసం నుంచి 20 కిలోమీటర్ల వరకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇందుకుగాను విద్యార్థి ఫొటో, స్కూల్ యాజమాన్యం నుంచి ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. మిగతా వారికి రాయితీతో బస్‌పాసులు మంజూరు చేస్తారు. పాసు ధరతో పాటు సంవత్సరం గుర్తింపు కార్డు కోసం రూ.100, నెలవారీ గుర్తింపు కార్డు రూ.50, సర్వీసు చార్జీ రూ.40 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. రాయితీ బస్ పాస్‌లు నెల, మూడు నెలలు, ఏడాది కాలపరిమితితో మంజూరు చేస్తారు. గడువు ముగిశాక రెన్యువల్ కోసం ప్రిన్సిపాల్ సంతకం చేయించుకుని తిరిగి పొందాల్సి ఉంటుంది. సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి ఏప్రిల్ వరకు, ఐటీఐ, పారా మెడికల్ వంటి కోర్సులు చదివే వారికి మే నెలలో పాసులు మంజూరు చేస్తారు. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక స్టేజీగా పరిగణలోకి తీసుకుని దూరాన్ని బట్టి రాయితీ ఇస్తారు. రామచంద్రపురం, రావులపాలెం, రాజోలు, అమలాపురం డిపోల నుంచి గతేడాది ఫ్రీ బస్‌పాస్‌లు, రాయితీ బస్‌పాస్‌లు, దివ్యాంగులకు 67,399 మందికి బస్‌పాస్‌లు జారీ చేశారు.

ప్రతి విద్యార్థికి రాయితీపై

ప్రతి విద్యార్థి రాయితీ బస్ పాస్ పొందవచ్చు. చార్జీలో ఒక వంతు మాత్రమే విద్యార్థి చెల్లించేలా ఈ పాస్‌లు జారీ చేస్తారు. విద్యార్థి నివాసం నుంచి 50 కిలోమీటర్ల వరకు రాయితీ పాస్ జారీ చేస్తారు. కళాశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ సమర్పించాలి. విద్యార్థి ఫొటో జత చేయాలి. విద్యార్థి నెలావారీ, మూడు నెలలకోసారి, సంవత్సరం పాస్‌లు పొందవచ్చు. మంత్లీ పాస్ ఐడీ కార్డులకు రూ.100 వంతున చెల్లించాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలి. కళాశాల విద్యార్థులు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు జిరాక్స్ జత చేయాలి. స్టడీ సర్టిఫికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సెల్ నంబర్ ఇవ్వాలి. దరఖాస్తులను సమీప డిపో మేనేజర్ పరిశీలించి పాస్ మంజూరుకు సిఫారసు చేస్తారు. వీటిని మంజూరు కౌంటరులో ఇచ్చి నిర్ణీత రుసుం చెల్లించి పాస్ పొందవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి



పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైనందున బస్‌పాసల జారీ ప్రక్రియను ప్రారంభించాం. ప్రభుత్వం అందించే బస్సు పాసులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవచ్చు. 50 కిలోమీటర్ల పరిధి వరకు రాయితీ బస్సు పాసులు జారీ చేస్తున్నాం. సదరం సర్టిఫికెట్ పొందిన దివ్యాంగులకు 50 శాతం రాయితీతో బస్సు పాస్‌లు జారీ చేస్తున్నాం.

– **ఎస్‌టీపీ రాఘవకుమార్**, జిల్లా ప్రజా రవాణా అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

డ్రైవింగ్‌కు లైసెన్స్ ముఖ్యం

- చదువు కోసం పోతూ చావు కొని తెచ్చుకోవద్దు
- కళాశాలకు బైక్‌పై ప్రయాణం ప్రమాదకరం
- ఆకతాయి పనులతో అనర్థం
- సురక్షిత ప్రయాణంతో మంచి భవిష్యత్తు



మండపేటలో 2024 ఫిబ్రవరి 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి (ఫైల్)

కపిలేశ్వరపురం: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై సుమారు నెలకావొస్తోంది. ఫలితాల వెల్లడి, టీసీ, స్టడీ సర్టిఫికెట్లు తీసుకోవడం, పై చదువులకు కళాశాలను ఎంచుకోవడం, అడ్మిషన్ తీసుకోవడం తదితర ప్రక్రియలతో జూన్ నెల బిజీ బిజీగా సాగింది. ఇక నుంచి పాఠ్యాంశాల బోధన, అంతర్గత స్థాయి పరీక్షల నిర్వహణ తదితర వాటితో విద్యార్థులు చదువుల్లో తలమునకలు అవుతారు. కళాశాలకు వెళ్లడం ఎంత అవసరమో ఆ ప్రయాణం సురక్షితంగా సాగేలా జాగ్రత్తలు తీసుకోవడమూ అంతే అవసరం. సురక్షిత ప్రయాణం ఆవశ్యకతపై ఈ కథనం...

పిల్లలకు వాహనాలిస్తే తండ్రిపై క్రిమినల్ కేసు

సురక్షిత ప్రయాణానికి ట్రాఫిక్, వెహికల్ డ్రైవింగ్ రూల్స్ రూపొందించారు. సినిమాలో హీరో తరహాలో వాహనాన్ని నడపాలన్న తపన వెనుక ప్రాణహాని పొంచి ఉందని గ్రహించాలి. పదో తరగతి , ఇంటర్మీడియెట్ విద్యార్థులకు వారి వయసు రీత్యా వాహనాన్ని నడిపే అర్హత ఉండదు. 18 ఏళ్లు నిండినవారు లైసెన్స్ లేకుండా ప్రయాణాలు చేయడం సరికాదు. అలా చేస్తే రూ.5వేల నుంచి రూ.10వేల వరకూ జరిమానా విధిస్తారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి. అతిక్రమించి ఇచ్చినట్టయితే తండ్రిపై కేసు నమోదు చేస్తారు. నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు. వాహనాలను నడిపేటప్పుడు నిర్లక్ష్యాన్ని విడనాడాలి. టూ వీలర్‌పై ముగ్గురు ప్రయాణం చేయడమంటే ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమే. సెల్‌ఫోన్లో మాట్లాడుతూ వాహనాన్ని నడపడం నేరం.

గతంలో ప్రమాదాలకు గురైన విద్యార్థులిలా...

- 2024 ఫిబ్రవరి 15న మండపేట మెహర్ బాబా ఆశ్రమం సమీపంలో లారీ ఢీకొని పట్టణంలోని ప్రైవేటు కళాశాలలోని సెకండ్ ఇంటర్ విద్యార్థి పడాల మధుసాయి మణికంఠ అక్కడికక్కడే మృతి చెందాడు.
- 2023 ఫిబ్రవరి 26న అయినవిల్లి మండలం నేదునూరు పెదపాలెం శివారు టి.సావరం వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో అమలాపురంలోని కళాశాలకు ప్రాక్టికల్ పరీక్షకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తున్న నందెపు రాజేష్ (17), అల్లపల్లి నాగేంద్ర (17) మృతిచెందారు.
- 2023 జూన్ 3న అమలాపురం మండలం నడిపూడికి చెందిన పదో తరగతి విద్యార్థి పెనుమల ప్రశాంతి (06) నడిపూడిలో మట్టి ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది.
- 2023 మే 19న అమలాపురం మహిపాల వీధికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని గంగా లక్ష్మీ జాహ్నవి (11) గాంధీనగర్ వద్ద మట్టి ట్రాక్టర్ ఢీకొని అదే రోజు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.
- 2023 డిసెంబర్ 3న మండపేట పట్టణంలోని మారేడుబాక వంతెన వద్ద కారు ఢీకొని మారేడుబాక గ్రామానికి చెందిన ఆరో తరగతి విద్యార్థి మాడెం ప్రవీణ్ (11) మృతిచెందాడు.

ఆకతాయి పనులు సైతం అనర్థాలను తెస్తాయి

విద్యార్థులు నదిలో స్నానాలకు దిగడం, జనావాసాల్లో రాళ్లు, కర్రలు విసరడం, వాహనాలను వంకరటింకరగా నడపడం వంటి ఆకతాయి పనులకు పాల్పడటం అనర్థం తెచ్చే ప్రమాదం ఉంది. 2023 మే 21న ఆలమూరు మండలం జొన్నాడ వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగిన అయినవిల్లి మండలం పెద్దిపాలెంనకు చెందిన ఇంటర్ విద్యార్థి మోటూరి త్రిలోక్(17), కొత్తపేట సాయిబాబా మందిర సమీప నివాసితుడైన నర్సరీ కూలి గెద్దం కరుణకుమార్ (22) మృతిచెందారు. వారి స్నేహితుడు కోరుమిల్లికి చెందిన అయినవిల్లి భవానీశంకర్ పుట్టినరోజును జరుపుకున్న తర్వాత వారు నదిలో స్నానానికి వెళ్లారు.

నిబంధనల పర్యవేక్షణకు సహకరించాలి

రహదారులపై వెహికల్ డ్రైవింగ్ రూల్స్ పాటించడంపై అధికారులు తనిఖీలు చేస్తుంటారు. వారికి విద్యార్థులు విధిగా సహకరించాలి. లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపాలన్న ఆలోచన విడనాడాలి. వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో పోలీసుల కళ్లు గప్పి ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లిపోవాలన్న ఆలోచన సరికాదు. విద్యార్థులను ఆటోలో తరలించేవారు 10 కిలోమీటర్ల లోపు ఉన్న విద్యాసంస్థలకు మాత్రమే తీసుకెళ్ళాలి. ఆటో నడిపే కార్మికుని పక్కన ప్రయాణికులు కూర్చోకూడదు. ఆటోకు రెండు వైపులా రక్షణ కవచం ఉండాలి. డ్రైవర్‌కు లైసెన్స్, వాహనానికి పర్మిట్ తప్పనిసరి.

సామాజిక బాధ్యతగా వ్యవహరించాలి



విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సామాజిక బాధ్యతగా వ్యవహరించాలి. సినిమా, సోషల్ మీడియా ప్రభావాలతో వాహనాలను నడపాలని కానీ, వేగంగా నడపాలని కానీ అనుకోవడంలోనే ప్రమాదం పొంచి ఉంది. రహదారిపై వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. అతిక్రమిస్తే వాహనం నడిపేవారి ప్రాణానికి ముప్పు వాటిల్లుతుంది. మరెవరినైనా ఢీకొంటే క్రిమినల్ కేసుల్లో ఇరుక్కొనే ప్రమాదమూ ఉంటుంది.

– పి.దొరరాజు, సీఐ, మండపేట రూరల్

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల గ్రామ శివారులో రైతు బోనం రామకృష్ణ కొబ్బరితోటలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు తెలిపారు. తాడిమళ్లలో రామకృష్ణ కొబ్బరి తోటలో సోమవారం ఉదయం కూలీలు పనిచేస్తుండగా కొబ్బరి చెట్టుకు వేలాడుతున్న గుర్తుతెలియని మృతదేహాన్ని చూసి అధికారులకు సమాచారం అందించారు. దీంతో వీఆర్వో కె.గంగాజలం ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉరి వేసుకున్న వ్యక్తి 50 ఏళ్ల వయస్సు కలిగి నిక్కరు ధరించి ఉన్నాడన్నారు. ఆ వ్యక్తి మృతిచెంది వారం రోజులు కావడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. వీఆర్వో గంగాజలం ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు నూకరాజు(ఫైల్)

తుని: రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక జీఆర్పీ ఎస్సై జీ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జీ మాడుగుల మండలం, కుమ్మరికిమ్ముడుపల్లికి చెందిన బోనంగి నూకరాజు(50) తుని రైల్వే స్టేషన్‌లో రెండో నంబర్ ఫ్లాట్‌ఫారం నుంచి ఒకటో నంబరు ఫ్లాట్‌ఫారానికి వెళ్లడానికి పట్టాలు దాటుతుండగా విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్లే రైలు ఢీకొట్టింది. దీంతో నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని బంధువులకు అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత...

కరప: ఇంట్లో వంట చేస్తుండగా విషసర్పం కాటువేయగా, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందింది. కరప మండలం గురజనాపల్లి గ్రామానికి చెందిన బోనంగి లోవతల్లి(31) ఈనెల 3వ తేదీన ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో వంట చేస్తుండగా ఒక విషసర్పం కాటువేసింది. వెంటనే ఆమెను చికిత్సకోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆమె చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలు లోవతల్లి భర్త ప్రసాద్‌కు మధ్య గొడవలు జరిగి ఏడాది కాలంగా గురజనాపల్లిలో తల్లితో పాటు ఉంటోంది. ఆమెకు 8 ఏళ్ల క్రితం వివాహం కాగా 2 సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. ఆమె సోదరి రాచకొండ శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అరుణాచల క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ

- అట్టహాసంగా 63 మంది నాయనార్ల విగ్రహ ప్రతిష్ఠ
- హాజరైన ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు, రాజకీయ నేతలు



రాచపల్లి అరుణాచల క్షేత్రంలో నాయనార్ల విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం




సభలో ప్రసంగిస్తున్న ధర్మపురి ఉత్తర పీఠాధిపతి సుక్కా స్వామీజీ

ప్రత్తిపాడు రూరల్: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో ఆంధ్రా అరుణాచలంగా ప్రసిద్ధి చెందిన అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. అరుణాచల మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన 63 మంది నాయనార్ల ప్రతిష్ఠ మహోత్సవాన్ని తిరువణ్ణామలై అరుళ్లిగు అరుణాచలేశ్వర స్వామి వారి దేవస్థానం అర్చకులు డాక్టర్ టి.అరుణాచల కార్తికేయ శివాచార్య వైభవంగా నిర్వహించారు. వీటితోపాటు దక్షిణామూర్తి విగ్రహాన్ని జెట్టి శివకుమార్ దంపతులు, లక్ష్మీ హయగ్రీవుడు విగ్రహాన్ని శ్రీహరి రాజబాబు దంపతులు, సూర్యభగవానుడు విగ్రహాన్ని దంతులూరి సుభద్రరామరాజు దంపతులు, కాలభైరవుడు విగ్రహాన్ని గిరిధరరెడ్డి దంపతులు, గంగామాత విగ్రహాన్ని బలభద్రుడి సత్యనారాయణ దంపతుల ఆర్థిక సహాయంతో ప్రతిష్ఠించారు. అనంతరం కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి సోమవారం వరకు నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శివనామ స్మరణతో ఆలయ ప్రాంగాణం మార్మోగింది. రాచపల్లి వెళ్లే ప్రధాన రహదారి భక్తులతో కిక్కిరిసిపోయింది.

భక్తి మార్గమే శరణ్యం

భక్తిమార్గమే అందరికీ శరణ్యమని తద్వారా ముక్తికి మార్గం లభిస్తుందని ధర్మపురి ఉత్తర పీఠాధిపతి సుక్కా స్వామిజీ అన్నారు. అరుణాచలక్షేత్రంలో 63 మంది నాయనార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సాన్ని పురస్కరించుకుని ఆధ్యాత్మిక వేత్త అరుణాచల మాధవి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తమిళనాడులో 5–10 శతాబ్దాల మధ్య కాలంలో నివసించిన గొప్ప శివ భక్తులే ఈ నాయనార్లని చెప్పారు. వీరు భక్తి మార్గం ద్వారా మోక్షసిద్ధి పొందినట్లు తెలిపారు. నాయనార్లలో రాజుల నుంచి మానవుల వరకు ఉన్నారని తెలిపారు. భగవంతుడిని చేరడానికి నిష్కలమషమైన భక్తి తప్ప ఇంకేదీ అవసరం లేదన్నారు. సభలో సమన్వయ సరస్వతి, వాగ్దేవి వరపుత్ర బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ, కృష్ణా జిల్లా, పెదపులిపాక విజయ రాజేశ్వరి దేవస్థానం పీఠాధిపతి వాసుదేవానందగిరి స్వామీజీ, శ్రీరమణాసేవాశ్రమం వ్యవస్థాపకులు స్వామి రామానందతో పాటు పలువురు ఆధ్యాత్మిక వేత్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పోకల వంశీ నాగేంద్రమాధవ్, జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్, ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

మోసానికి చిరునామా చంద్రబాబు



యోగాంధ్రలో పాల్గొన్నట్లు రెవ.విజయసారథికి వచ్చిన పార్టిసిపేషన్ సర్టిఫికెట్

రాజమహేంద్రవరం రూరల్: మోసానికి చిరునామాగా చంద్రబాబు ప్రభుత్వం నిలిచిందని వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు రెవ.విజయసారథి అన్నారు. సోమవారం కొంతమూరులోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ యోగాంధ్రా కార్యక్రమంలో పాల్గొనని తనకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ పంపారన్నారు. అంతకంటే దారుణం ఏమిటంటే కాటవరం సచివాలయం, సీతానగరం మండలం అనే అడ్రస్సులో నివసిస్తున్నట్లుగా ఆ సర్టిఫికెట్‌లో తెలియజేశారన్నారు. గిన్నిస్ బుక్ రికార్డుల కోసం మృతిచెందిన వారి పేరిట సైతం యోగాలో పాల్గొన్నట్లు సర్టిఫికెట్లు జారీచేయడం, వారి పనితీరుకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. పేదవాడికి అందించాల్సిన ఏ ఒక్క స్కీమును అందించని సీఎం చంద్రబాబు, ఒక్కరోజు యోగా దినోత్సవం కోసం రూ.300 కోట్లు ఖర్చు పెట్టడం దారుణం అన్నారు.

తమ్ముళ్ల కారు కూతలు!

- నడిరోడ్డుపై బయటపడ్డ వర్గ పోరు
- కారు అడ్డం వచ్చిందనే వంకతో దుర్భాషలు



మునగాల సమీపంలో పెందుర్తి కారుకు అడ్డంగా ఉంచిన మరో వర్గం కారు



మునగాల సమీపంలో టీడీపీలోని ఇరువర్గాల మధ్య వాగ్వాదం

టాస్క్‌ఫోర్స్: టీడీపీ నేతల గ్రామాల పర్యటన కుమ్ములాట, తోపులాటలకు నిలయమైంది. వారి మధ్య వర్గపోరును బహిర్గతం చేసింది. అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించేందుకు ఎంపీ పురందేశ్వరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేశ్ కుమారుడు పెందుర్తి అభిరామ్ సోమవారం కాన్వాయ్‌లో బయలుదేరారు. రాజానగరం మండలం పాలచర్ల, కోరుకొండ మండలం గాడాల అనంతరం మునగాలకు బయలుదేరిన కాన్వాయ్‌లో మొదటి నుంచి వాహనాలు ఓవర్ టేక్ చేసుకోవడం వివాదానికి కారణమయ్యింది. అటు నుంచి పలు గ్రామాలకు కాన్వాయ్ వెళ్లింది. కోరుకొండ మండలం మునగాలలోని కార్యక్రమానికి వెళ్తుండగా పెందుర్తి కారుకు మరో వర్గం కారు అడ్డుపడటంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. పెందుర్తి వర్గానికి చెందిన నాయకుడిని దుర్భాషలాడటంతో వివాదం తీవ్రతరమయ్యింది. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ అరుపులు, కేకలతో ఇరువర్గాల కార్యకర్తలు ఘర్షణకు దిగారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బొడ్డు వెంకటరమణ చౌదరి ఉండడంతో రుడా చైర్మన్ పదవి పెందుర్తి అభిరామ్‌కు వస్తుందనే ఊహాగానాలు వెలువడ్డాయి. అది అభిరామ్‌కు దక్కకపోవడంతో నాటి నుంచి వివాదాలు అంతర్గతంగా ఉన్నాయి. ఆ వివాదాలు మునగాల ఘటన ద్వారా బయట పడ్డాయి. కూటమిలోని ఇతర నాయకులు జోక్యం చేసుకుని వ్యవహారం సద్దుమణిగేలా చేశారు. పార్టీలో ఆధిపత్య పోరు ఇలా నడిరోడ్డుపై దుర్భాష లాడటం వరకూ వెళ్లింది. కూటమిలోని పార్టీ నాయకులు, స్థానికులు, రైతుల్లో ఈ వ్యవహారం చర్చనీయాంశమైంది.

విద్యుత్ బిల్లు సర్దుబాటు

రూ.లక్షల్లో వచ్చిన బిల్లు రూ.వేలల్లోకి మార్చిన వైనం

మలికిపురం: చిన్న దుకాణానికి మెగా విద్యుత్ బిల్లు శీర్షికతో ఈ నెల 7వ తేదీన సాక్షిలో ప్రచురితమైన వార్తకు విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. మలికిపురం గ్రామానికి చెందిన కుంపట్ల యువకుమార్ అద్దెకు షాపు తీసుకుని వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆ షాపునకు విద్యుత్ బిల్లు రూ.3,38,496 వచ్చింది. ఆ బిల్లును చూసి షాపు యజమాని ఒక్కసారిగా కంగారు పడ్డాడు. ఈ విషయం సాక్షిలో ప్రచురించడంతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.రాజేశ్వరి స్పందించారు. పాత విద్యుత్ మీటరు స్థానంలో కొత్త విద్యుత్ మీటరు మార్పు చేయడం ద్వారా పాత మీటరులో ఉన్న రీడింగ్ అంతా బిల్లు రూపంలో వచ్చిందన్నారు. జరిగిన తప్పిదాన్ని గుర్తించి రూ.3,38,496 వచ్చిన విద్యుత్ బిల్లును రూ. 7,855కు సర్దుబాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి

మలికిపురం: మండలంలోని రామరాజులంక గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి మేడిచర్ల భాస్కరరావు(40) పశ్చిమ గోదావరి జిల్లా చించినాడలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎదురుగా వస్తున్న సిమెంట్ లారీ ఢీకొన్న ఘటనలో అతను మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం అలముకుంది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

హుండీ దొంగకు రిమాండ్

కరప: మండలం నడకుదురులోని వేంకటేశ్వరస్వామి గుడిలోని హుండీని దోచుకుపోయిన దొంగ పోలీసులకు చిక్కాడు. కాకినాడ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. నడకుదురు వేంకటేశ్వరస్వామి గుడిలో ఈ నెల 3న గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి, హుండీ తాళం బద్దలుకొట్టి అందులోని రూ.3 వేల నగదు దోచుకుపోయినట్టు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దొంగతనం కేసు నమోదు చేసిన కరప ఎస్ఐ టి.సునీత, ఏఎస్ఐ వి.సూరిబాబుతో కల్సి దర్యాప్తు చేసి సోమవారం తూరంగి నివాసి తిక్క అంజి అనే బొడ్డు అంజిబాబును అరెస్ట్ చేసి, హుండీ సొమ్ము రూ.3.060 స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ సునీత తెలిపారు.

ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో అవకతవకలు

- స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్‌కు ఫిర్యాదు
- ఫెన్సింగ్ క్రీడాకారుడు గౌతమ్‌రాజ్



స్పోర్ట్స్ అథారిటీ వైస్‌చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న గౌతమ్‌రాజ్

సామర్లకోట: సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్ స్పోర్ట్స్ కోటా ద్వారా ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నాయని స్థానిక ప్రముఖ ఫెన్సింగ్ క్రీడాకారుడు ఎం గౌతమ్‌రాజ్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వైస్‌చైర్మన్‌కు వినతి పత్రం అందజేశానన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నీట్ పరీక్ష రాసే అభ్యర్థి పేరుపై మరొకరు టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారన్నారు. దాంతో స్పోర్ట్సులో కనీస పరిజ్ఞానం లేని వారు స్పోర్ట్స్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు సంపాదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడల్లో ప్రాతినిధ్యం వహించని వారికి నకిలీ ధ్రువపత్రాలను జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. సాఫ్ట్‌బాల్ ఆటకే పరిమితం కాకుండా ఫెన్సింగ్ ఆటలోనూ ఇదే విధంగా జరుగుతోందన్నారు. ఫెన్సింగ్ ఆటను ముసుగు ధరించి ఆడటం వలన ఎవరు ఆడుతున్నారో తెలియడం లేదన్నారు. దీనిని ఆసరాగా తీసుకొని దందా జరుగుతోందని చెప్పారు. విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించవలసిన ఫెన్సింగ్ అసోసియేషన్ క్రీడాస్ఫూర్తిని అణగదొక్కుతోందన్నారు. దొడ్డిదారిలో ఎంబీబీఎస్ సీట్లు సాధిస్తున్న వారిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని గౌతమ్‌రాజ్ కోరారు.

బంధాన్ని కాదని.. అనుబంధాన్ని తెంచుకుని..

- రైలు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు
- తండ్రిని వద్దంటున్న కుమారుడు.. తనకు భర్త లేడంటున్న భార్య



వృద్ధుడు సుబ్బారావు



తణుకు ఆస్పత్రిలో సుధీర్‌రాజుకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఆర్ఎంఓ తాతారావు

తణుకు అర్బన్: వివాహ బంధాన్ని భార్య వద్దంటోంది. కన్నతండ్రితో అనుబంధాన్ని కుమారుడు తెంచుకుంటున్నాడు. ఏడేళ్ల క్రితం తెగిపోయిన రక్తసంబంధం నేడు ఎదురైనా తమకు వద్దంటే వద్దని ఆ కుటుంబం తెగేసి చెబుతోంది. దీంతో ప్రమాదవశాత్తూ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు అల్లాడుతున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంకు చెందిన కలగర సుబ్బారావు ఏడేళ్ల కిత్రం ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. ఆదివారం కాల్దారి స్టేషన్‌లో రైలు నుంచి జారిపడగా రైల్వే పోలీసులు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడిని ఆరా తీయగా కుటుంబ సభ్యుల వివరాలు తెలిపారు. రైల్వే కానిస్టేబుల్ బాల విషయాన్ని వృద్ధుడి కుమారుడు సుధీర్‌రాజుకు ఫోన్ ద్వారా తెలియజేయగా తనకు నాన్న అవసరం లేదని తెగేసి చెప్పాడు. అయినా కానిస్టేబుల్ బాల ప్రకాశరావుపాలెంలోని ఇంటికి వెళ్లి వృద్ధుడి భార్యతో విషయం చెప్పగా తన భర్త ఎప్పుడో చనిపోయాడని, అతడి మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని వితంతు పింఛను కూడా పొందుతున్నట్టు సమాధానం ఇవ్వడంతో రైల్వే పోలీసులు ఆశ్చర్యపోయారు.

కేసు నమోదు చేసినా ఇబ్బంది లేదు

సుధీర్‌రాజును ఎట్టకేలకు రైల్వే పోలీసులు తణుకు ఆస్పత్రికి తీసుకురాగా సోమవారం ఆర్ఎంఓ డాక్టర్ ఏవీఆర్ఎస్ తాతారావు కౌన్సెలింగ్ ఇచ్చారు. తమకు సుబ్బారావు అవసరం లేదని, అవసరమైతే అలా రాసిస్తామని సుధీర్‌రాజు సమాధానమిచ్చాడు. దీంతో సీఐ ఎన్.కొండయ్య ఆస్పత్రి వద్దకు వచ్చి కన్న తండ్రిపై నిర్లక్ష్యం వహిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించగా.. కేసు నమోదు చేసుకోమని సుధీర్‌రాజు తెగేసి చెప్పాడు. దీంతో చేసేదిలేక ఆస్పత్రి వైద్యులు సుబ్బారావుకు చికిత్స అందిస్తున్నారు.